క్లుప్తంగా

అస్సాం డిప్యూటీ స్పీకర్‌కు ఘనస్వాగతం



నుమల్ మోమిన్‌ను సన్మానిస్తున్న నాయకులు

చేవెళ్ల: అస్సాం డిప్యూటీ స్పీకర్ నుమల్ మోమిన్‌కు చేవెళ్లలో బీజేపీ నాయకులు ఘన స్వాగతం తెలిపారు. గురువారం చేవెళ్ల మీదుగా కర్ణాటక వెళ్తున్న ఆయనకు బీజేపీ మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు చేవెళ్లలో స్వాగతం తెలుపుతూ శాలువాతో సన్మానించారు. కాసేపు ఆయన బీజేపీ నాయకులతో కలిసి మాట్లాడి పార్టీ గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, నాయకులు మచ్చేందర్ రెడ్డి, జయసింహారెడ్డి, అభిషేక్, ప్రశాంత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

బీజేపీ కౌన్సిల్ జిల్లా మెంబర్‌గా మహేశ్



కుమ్మరి మహేశ్

కేశంపేట: మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామానికి చెందిన కుమ్మరి మహేశ్‌ను బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా ఎంపిక చేశారు. ఈ మేరకు గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి మహేశ్‌కు నియామకపత్రం అందించారు. పార్టీ సిద్ధాంతాలను గ్రామాల్లో ఇంటింటికీ తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేస్తానని ఈ సందర్భంగా మహేశ్ తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించడంపై ఎంపీ డీకే అరుణకు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మార్మోగిన శివనామస్మరణ



పూజలో పాల్గొన్న శివస్వాములు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని పెద్దఎల్కిచర్ల గ్రామం గురువారం శివనామస్మరణతో మార్మోగింది. గ్రామంలోని శివరామాంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో గురువారం గురుస్వామి భూపాలచారి ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో శివస్వాములు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివ దీక్ష ఎంతో పవిత్రమైనదని, నియమ నిబంధనలతో దీక్షలు పూర్తిచేస్తే కోరిన కోర్కెలు తీరుతాయన్నారు. అనంతరం శివస్వాములు పాదయాత్రతో శ్రీశైలం బయలుదేరారు. కార్యక్రమంలో శివస్వాములు రామ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బుగ్గయ్య, యాదయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

కబడ్డీ టోర్నమెంట్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



టోర్నమెంట్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొందుర్గు: ఛత్రపతి శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19న ప్రారంభం కానున్న కబడ్డీ టోర్నమెంట్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌నుగురువారం మండల కేంద్రంలో మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో యువతలో చైతన్యం వస్తుందని, స్నేహభావంతో క్రీడలను విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కావలి యాదయ్య, రామయ్యగౌడ్, చందు, వాసూరి, లింగం, యాదయ్య, నరేందర్, దశరథం,పాల్గొన్నారు.

పృథ్వీ కాలనీ సమస్యలు తీర్చండి

ఎంపీడీఓకు కాలనీవాసుల వినతి

నందిగామ: మండల పరిధిలోని అంతిరెడ్డిగూడ గ్రామ పంచాయతీలోని పృథ్వీ కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు గురువారం ఎంపీడీఓ సుమతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉందని, మురుగునీరు హనుమాన్ దేవాలయంలోకి చేరుతోందని, దోమల బెడద ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. మురుగు నీరు రోడ్లపైకి చేరడంతో దుర్వాసన వస్తుందని ఆరోపించారు. అదేవిధంగా కాలనీలో స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, సుధాకర్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

త్వరలోనే బస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తాం

ఎమ్మెల్యే కాలె యాదయ్య



బస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, స్థానిక నాయకులు

చేవెళ్ల: ప్రయాణికుల అవసరాలకు అనుకూలంగా చేవెళ్లలో బస్‌స్టేషన్ నిర్మాణం జరిగిందని, త్వరలోనే ప్రారంభించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన స్థానిక నాయకులతో కలిసి నూతనంగా నిర్మించిన బస్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా బస్‌స్టేషన్ ఆవరణ మొత్తం తిరిగి సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల బస్‌స్టేషన్ నిర్మాణానికి హెచ్ఎండీఏ నుంచి రూ.6కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులు మంజూరు చేసిన హెచ్ఎండీఏకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పనులు చివరి దశకు చేరుకున్నాయని, త్వరలోనే బస్‌స్టేషన్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రజల అవసరాలకు తగిన విధంగా ఉండేలా నూతన బస్‌స్టేషన్ నిర్మాణం చేపట్టామన్నారు. ముందు భాగంలో ఉన్న పాత బస్‌స్టేషన్‌ను తొలగిస్తే బాగుంటుందని అధికారులకు సూచిస్తే, దీనిపై వారు తమకు ఆదేశాలు లేవని చెప్పటంతో దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడుతానన్నారు. త్వరలోనే ప్రారంభించేందుకు కృషి చేస్తామన్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు, మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి. జిల్లా పార్టీ నాయకుడు ఆగిరెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులపై ఆరోపణలు మానుకో

ఎమ్మెల్సీకి కాంగ్రెస్ నేతల హెచ్చరిక



మాట్లాడుతున్న నాయకులు

కొత్తూరు: షాద్‌నగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హయాంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై రాజకీయ ఆరోపణలు మానుకోవాలని మండల కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డిని హెచ్చరించారు. ఇటీవల ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడిన తీరును వ్యతిరేకిస్తూ నాయకులు గురువారం పట్టణంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డితో పాటు మున్సిపాలిటీ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ.. మొగిలిగిద్ద, చించోడు గ్రామాలను కొత్త మండలాలుగా ప్రకటిస్తే రూ.2కోట్లు ఇస్తానని ఎమ్మెల్సీ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తన సొంత మండలం నందిగామ అభివృద్ధిని పట్టించుకోని ఆయన కొత్త మండలాలు, నియోజకవర్గ అభివృద్ధిపై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. పేద విద్యార్థుల ప్రయోజనాల కోసం ఎమ్మెల్యే దాతల సహకారంతో కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. కాగా కళాశాల నిర్మాణానికి ఎలాంటి సాయం చేయని ఎమ్మెల్సీ దాతల సాయంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకోవడానికి ప్రయత్నాలు చేస్తామంటే కాంగ్రెస్ నేతలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. మరోమారు ఎమ్మెల్సీ నిజాలు తెలుసుకోకుండా నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కర్రొల్ల సురేందర్, వీరమోని దేవేందర్, శివకుమార్‌గౌడ్, జనార్ధన్‌చారి, చిల్కమర్రి నర్సింహ పాల్గొన్నారు.

హామీల పేరుతో ప్రజలను మోసం



మొయినాబాద్‌లో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు



శంకర్‌పల్లి: మహారాజ్‌పేటలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- కాంగ్రెస్ వైఫల్యాలపై బీఆర్ఎస్ నాయకుల నిరసన
- గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు వినతిపత్రాల అందజేత

మొయినాబాద్: గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చి రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, కొత్త నర్సింహారెడ్డి అన్నారు. 420 హామీలు అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు గురువారం మండల కేంద్రంలో గాంధీజీ చిత్రపటానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు ఇచ్చి 420 రోజులు గడుస్తున్నా ఒక్క హామీని కూడా సంపూర్ణంగా అమలు చేయలేదని విమర్శించారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కడం కాంగ్రెస్ ప్రభుత్వ నైజం అన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇస్తున్నామని కొన్ని గ్రామాల్లో కొందరి చేతుల్లో పత్రాలు పెట్టి వదిలేశారని.. ఎవరికీ ఆ పథకాలు అందలేదన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్‌లు దారెడ్డి వెంకట్‌రెడ్డి, రవూఫ్, పీఏసీఎస్ డైరెక్టర్ పాటి జగన్‌మోహన్‌రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు జయవంత్, కార్యదర్శి నర్సింహాగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాలతో పాటు వివిధ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు గురువారం గాంధీ విగ్రహాలకు వినతి పత్రం అందజేసి నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు నెరవేర్చేవిధంగా వారికి మంచి బుద్ధి ప్రసాదించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమలులో విఫలం

శంకర్‌పల్లి: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మహారాజ్‌పేట్ గ్రామంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి, హామీలను అమలు చేయాలంటూ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ శశిధర్ రెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, ఇంద్రాసేనారెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీకాంత్, మాణిక్యరెడ్డి, యాదగిరి, లింగం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు హెచ్ఆర్ఏను అమలు చేయాలని వినతి

షాద్‌నగర్‌రూరల్: మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెంచిన హెచ్ఆర్ఏను అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు 13శాతం హెచ్ఆర్ఏను అమలు చేయాలని కోరుతూ నాయకులు ఆర్డీఓ సరితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీ పరిధిల్లో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు 13శాతం హెచ్ఆర్ఏను ఇస్తున్నారని, షాద్‌నగర్ పరిధిలో ఆ ఉత్తర్వులు అమలు కావడం లేదన్నారు. షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోనూ అమలు చేసేందుకు చర్యలు తీసేకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, సత్యం, తిరుమలయ్య తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం

కేశంపేట: మండల కేంద్రంలో బుధవారం గుంటి ఆంజనేయులు ఆకస్మికంగా మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం గురువారం జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, జర్నలిస్ట్ గుండ్రాతి రమణయ్యగౌడ్ రూ.5వేల చొప్పున, పవన్ కుమార్ రూ.3వేల ఆర్థికసాయం అందించారు. అదేవిధంగా గ్రామంలో పులిమామిడి కృష్ణయ్య ఇటీవల మృతి చెందడంతో అతడి కుటుంబ సభ్యులకు గుండ్రాతి రమణయ్యగౌడ్ రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో గంజాయి దశరథ, పోలేపోగు మురళీమోహన్, వెంకటయ్య, ఆంజనేయులు, సునీల్, యాదయ్య, మల్లేశ్, కడియాల యాదయ్య, పులిమామిడి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల ఎంపీటీసీ స్థానాలపై నోటిఫికేషన్ విడుదల

చేవెళ్ల: చేవెళ్ల మండలంలో గతంలో 17 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. మున్సిపాలిటీ ఏర్పాటుతో మండలంలో ఉన్న జనాభా ప్రతిపాదికన 12 ఎంపీటీసీ స్థానాలకు తగ్గుతున్నాయని, దీనికి సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేశామని ఎంపీడీఓ హిమబిందు తెలిపారు. గురువారం ఈ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేసిన ఆమె దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. డ్రాఫ్ట్ నోటిఫికేషన్ 30న విడుదల చేశామని, వీటిపై 31న అభ్యంతరాల స్వీకరణ, ఫిబ్రవరి 1, 2లలో పరిశీలన, 3వ తేదీ ఫైనల్ జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు.

అభ్యంతరాలుంటే చెప్పండి

కొత్తూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో కొత్తగా ప్రతిపాదించిన ఎంపీటీసీల స్థానాలు, గ్రామాల పరిమితులపై అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ అరుంధతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తూరు మున్సిపాలిటీ ఏర్పడకముందు మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. ప్రస్తుతం 6 స్థానాలు ఉన్నట్లు వివరించారు. గూడూరు ఎంపీటీసీ పరిధిలో గూడూరు, మక్తగూడ, మల్లాపూర్ తాండ గ్రామాలు, తీగాపూర్ ఎంపీటీసీ పరిధిలో తీగాపూర్, మల్లాపూర్, పెంజర్ల ఎంపీటీసీ పరిధిలో పెంజర్ల, కొడిచర్ల ఎంపీటీసీ పరిధిలో కొడిచర్ల, కొడిచర్లతాండ, ఎస్‌బీపల్లి, ఇన్ముల్‌నర్వ పరిధిలో ఇన్ముల్‌నర్వ, సిద్ధాపూర్ ఎంపీటీసీ పరిధిలో సిద్ధాపూర్, వైఎంతాండ గ్రామాలు ఉన్నట్లు పేర్కొన్నారు. కాగా 31న అభ్యంతరాల స్వీకరణ, ఫిబ్రవరి 1, 2న అభ్యంతరాల పరిష్కరణ, 3న తుది జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు.

‘లక్ష్మీదేవిపల్లి’కి నిధులు కేటాయించండి

- మొగిలిగిద్దకు వస్తున్న సీఎం రిజర్వాయర్‌పై వైఖరిని స్పష్టం చేయాలి
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: పాలమూరు బిడ్డగా సీఎం రేవంత్ రెడ్డి లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి సర్కార్ లక్ష్మీదేవిపల్లి నిర్మాణానికి రూ.35వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించారని, తెలంగాణ ఉద్యమంలో పాలమూరు జిల్లా నుంచి ఎంపీగా కేసీఆర్ గెలిచిన తర్వాత లక్ష్మీదేవిపల్లి డిజైన్, బడ్జెట్‌లో మార్పులు జరిగాయన్నారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును కట్టి తీరుతామని చెప్పిన గత ప్రభుత్వాలు ప్రాజెక్టుకు తట్టెడు మట్టిని కూడా తీయలేదని ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న పాలమూరు బిడ్డ రేవంత్‌రెడ్డి లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణంపై ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌ను తొండి సంజయ్ అంటూ వ్యక్తిగతంగా దూషించడం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు సరికాదని హితవు పలికారు. ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుంచి వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ పార్టీ నుంచి నవీన్‌కుమార్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారని, తమ అధికారాన్ని నియోజకవర్గ అభివృద్ధికి ఉపయోగించాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి మొగిలిగిద్దకు వస్తున్న సందర్భంగా చించోడ్, మొగిలిగిద్ద గ్రామాలను మండల కేంద్రాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, నాయకులు దితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

షాబాద్: ప్రభుత్వ పథకాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 34 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ చెక్కులు, ఏడుగురికి సీఎం సహాయనిధి చెక్కులను వారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, ఎంపీడీఓ అపర్ణ, తహసీల్దార్ కృష్ణయ్య, డిప్యూటీ తహసీల్దార్ మధు, మాజీ సహకార సంఘం చైర్మన్ చాల్లా రాంరెడ్డి, నాయకులు తదితరులున్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం

సత్యం, అహింసతో దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహాత్మాగాంధీ చూపిన మార్గం అనుసరణీయమని పలువురు పేర్కొన్నారు. గురువారం మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ ఆశయాల సాధనకు కృషి చేయాలని, ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో వివిధ పార్టీల నాయకులు, యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌రూరల్: గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు



కేశంపేట: వేములనర్వలో..

వర్గీకరణతో మాదిగలకు న్యాయం



షాబాద్: వెంకటయ్యకు నియామకపత్రం అందజేస్తున్న మద్దిలేటి మాదిగ, తదితరులు

ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మద్దిలేటి మాదిగ

షాబాద్: ఎస్సీ వర్గీకరణ చేస్తేనే బడుగు, బలహీన వర్గాలకు మేలు జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మద్దిలేటి మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్యాసారం శంకర్‌రావు మాదిగ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకులతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు ఎమ్మార్పీఎస్ చేపట్టిన 30ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయం దక్కిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 7న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించే లక్ష డప్పులు-వెయ్యి గొంతుకల ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు దోస్వాడ నర్సింలు, మాజీ మండల కన్వీనర్ మల్లగల్ల యాదయ్య, ప్రవీణ్, కుమార్, బాల్‌రాజ్, తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం

ఏట్ల ఎర్రవల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పుంటికూర వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా చిర్ర నరేందర్, అధికార ప్రతినిధిగా మల్కి రాంచంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా అవుల అబిరామ్, కార్యదర్శిగా అవులు రాజు, ప్రచార కార్యదర్శిగా చెన్న కేశవులు, కోశాధికారులుగా పుంటికూర చిన్న జంగయ్య, యాదయ్య, వెంకటయ్య, సలహాదారులుగా నర్సింలు, బాబు, జంగయ్య, యాదయ్య, శ్రీనివాస్, అర్జున్, రాములు ఎన్నికయ్యారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి

కేశంపేట: సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తీర్పును అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిర్ర శ్రీను డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే వేల గొంతులు-లక్ష డప్పుల సాంస్కృతిక మహా ప్రదర్శన కార్యక్రమంపైన మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సమావేశంను నిర్వహించారు. ఫిబ్రవరి 7లోపు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై స్పందిస్తే హైదరాబాద్‌లో విజయోత్సవాలు నిర్వహిస్తామని, లేకుంటే రాష్ట్ర ప్రభుత్వ చావు డప్పును మోగిస్తామని అయన హెచ్చరించారు. కార్యక్రమంలో గంజాయి దశరథ, గ్యార సురేష్, పంది లింగం, సునీల్, కుమార్, యాదయ్య, లక్ష్మయ్య, కేశవులు, భూపాల్, రాజు, గోపాల్, మహేశ్, అశోక్, వేణు తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో తొమ్మిది ఎంపీటీసీలు మాత్రమే

ఎంపీడీవో సంధ్య



ఎంపీటీసీల ముసాయిదాను విడుదల చేస్తున్న ఎంపీడీఓ సంధ్య, తదితరులు

మొయినాబాద్‌రూరల్: మొయినాబాద్ మండలంలో 17 ఎంపీటీసీలకు గాను ఎనిమిది ఎంపీటీసీలు మున్సిపాలిటీలో పోగా తొమ్మిది ఎంపీటీసీలు మాత్రమే మండల పరిషత్‌లో ఉన్నాయని జిల్లా అధికారుల సూచనలతో తెలిపామని మండల అభివృద్ధి అధికారి సంధ్య పేర్కొన్నారు. గురువారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో సాయంత్రం ఎంపీటీసీలకు సంబంధించిన పంచాయతీ రాజ్ యాక్ట్ 2018 ప్రకారం మున్సిపాలిటీలో పోయిన గ్రామాలను వదిలిపెడితే తొమ్మిది ఎంపీటీసీలు కేవలం మొయినాబాద్ మండలానికి మిగిలాయని ప్రభుత్వం ద్వారా ముసాయిదా విడుదలైందని తెలిపారు. ఎంపీటీసీల వివరాలను నోటీసు బోర్డులో ప్రకటించిన వారిలో ఎంపీడీఓతో పాటు ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, మండల సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.